సాక్షి
కామారెడ్డి

బుధవారం । 22 । మార్చి । 2023



ఉత్తమ ఫలితాలు సాధించాలి

విద్యార్థులు కష్టపడి చదివి పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని వక్తలు సూచించారు.

- 9లో ▸



దేశంలో ఆదర్శం కంటివెలుగు

అంధత్వ రహిత తెలంగాణే లక్ష్యంతో సీఎం కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని అమలు చేశారని ఎమ్మెల్యే సురేందర్ అన్నారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.4 /21.4

ఉదయం చలిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నీటి ఎద్దడి లేకుండా చూడాలి



కామారెడ్డి క్రైం: జిల్లాలో నీటిఎద్దడి ఏర్పడకుండా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో నీటి ఎద్దడి నివారణ చర్యలపై మంగళవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని మూడు మున్సిపాలిటీల పరిధిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలన్నారు. అధికారులు ముందు జాగ్రత్త ఏర్పాట్లు చేయాలని సూచించారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో పట్టణాలు, గ్రామాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేయించాలన్నారు. వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉపాధిహామీ కూలీలకు, స్వయం సహాయక సంఘాల మహిళలకు అవగాహన కల్పించాలని వైద్య శాఖ అధికారులకు సూచించారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని నర్సరీల్లో మొక్కలు ఏపుగా పెరిగేలా సంరక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వాతావరణ మార్పు, ఆరోగ్య ప్రభావాలు అనే వాల్‌పోస్టర్లను కలెక్టర్ చేతులమీదుగా ఆవిష్కరించారు. సమావేశంలో ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, డీఆర్‌డీవో సాయన్న, డీపీవో శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో లక్ష్మణ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'ధరణి' వేలం



కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రానికి సమీపంలోని ధరణి టౌన్‌షిప్‌లో మిగిలిన పాట్లు, గృహాలకు ఐదు రోజుల పాటు నిర్వహించిన వేలం పాట మంగళవారం ముగిసింది. ఆఖరి రోజు 12 పాట్లు, 4 గృహాలు అమ్ముడుపోయాయి. తద్వారా రూ. 2.90 కోట్ల ఆదాయం వచ్చింది. మొత్తం మీద ఐదు రోజుల్లో 50 ప్లాట్లు, 11 గృహాలు వేలంపాట ద్వారా విక్రయించడం జరిగిందనీ, తద్వారా రూ.7.92 కోట్ల ఆదాయం వచ్చిందని కలెక్టరేట్ ఏవో రవీందర్ తెలిపారు. కార్యక్రమంలో రాజీవ్ స్వగృహ ఏజీఎం సత్యనారాయణ, అధికారులు రాందాస్, సాయి భుజంగరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకోవాలి



కామారెడ్డి రూరల్: విద్యార్థులు కష్టపడి చదివి, ఉన్నతస్థాయికి చేరుకోవాలని డీఈవో రాజు పేర్కొన్నారు. కామారెడ్డి మున్సిపల్‌పరిధిలోని దేవునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆయన పదో తరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతులను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. హెచ్‌ఎం గంగాకిషన్, భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు చింద సాయిలును అభినందించారు.

ఆధార్ కేంద్రం పరిశీలన..

దేవునిపల్లి ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఉచిత ఆధార్ అప్డేట్ కేంద్రాన్ని డీఈవో రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ స్కూల్లో చదివే విద్యార్థులకు ఆధార్ కార్డు అప్డేషన్ ఉచితంగా చేస్తున్నామని తెలిపారు. పాఠశాలలో 80 మంది విద్యార్థుల ఆధార్ కార్డుల అప్డేషన్ పూర్తి చేసిన హెచ్‌ఎంను అభినందించారు.

క్వార్టర్స్‌కు నిఖత్



నిజామాబాద్ నాగారం : మహిళల వరల్డ్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో నిఖత్‌జరీన్ క్వార్టర్స్ ఫైనల్‌కు చేరింది. ఢిల్లీలో జరుగుతున్న బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో నిఖత్ ప్రత్యర్థులను తన పంచులతో మట్టికరిపిస్తోంది. మంగళవారం జరిగిన ప్రీ క్వార్టర్స్ ఫైనల్ మ్యాచ్‌లో మెక్సికోకు చెందిన క్రీడాకారిణి 5-0 తేడాతో ఓడించి క్వార్టర్స్‌కు చేరింది.

ప్రకృతి పండుగ!



- ఆరోగ్య ప్రదాయని షడ్రుచుల పచ్చడి
- ఉషస్సులు తెచ్చే నూతన పండుగ
- నేడు శోభకృత్ నామ ఉగాది

సాక్షి, కామారెడ్డి: చంద్రమానాన్ని అనుసరించి చైత్ర శుద్ధ పాడ్యమి నాడు నూతన సంవత్సరాది 'ఉగాది'ని జరుపుకోవడం అనాదిగా వస్తోంది. జీవితంలో కష్ట సుఖాలు, చీకటి వెలుగులు ఒకేలా స్వీకరిస్తూ, ధృడచిత్తంతో ముందుకు సాగాలనే దివ్య సందేశాన్ని అందించేదే ఉగాది పండుగ. జీవన గమనంలో ఎదురయ్యే సుఖ, దుఃఖాలు ఆనందాలు, మధురస్మృతులు, కష్టాలు, కన్నీళ్లు.. వీటన్నింటినీ స్ఫూరణకు తెస్తూ షడ్రుచుల సమ్మేళనమై అందరి హృదయాలను సంబరాల్లో ముంచెత్తడానికి 'శోభకృత్ నామ' ఉగాది పండుగను జిల్లా ప్రజలు బుధవారం జరుపుకోనున్నారు. పండుగలో భాగంగా ఇంటి దర్వాజలన్నింటికీ మామిడి తోరణాలు కడతారు. పండుగ పూట ఉదయమే అందరూ తలంటూ స్నానమాచరించి పూజాదికార్యక్రమాలు నిర్వహిస్తారు. షడ్రుచులతో తయారు చేసిన పచ్చడిని సేవించి, తీపి వంటకాలతో భుజిస్తారు. పంచాంగ శ్రవణంతో భవిష్యత్తును తెలుసుకుంటారు. ఆలయాలకు వెళ్లి పూజలు చేస్తారు. చాలా గ్రామాల్లో ఎడ్ల బండ్ల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ఒక వైపు యాంత్రీకరణతో ఎడ్ల బండ్లు కనుమరుగవుతున్న ఈ రోజుల్లో ఉగాది రోజున రైతులు తమ బండ్లను శుద్ధిచేసి వాటిని అలంకరిస్తారు. అలాగే ఎడ్లను అలంకరించి ఆలయాలకు తీసుకెళ్లి ప్రదర్శనలు నిర్వహిస్తారు. ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న ఎడ్లబండ్ల ఊరేగింపు సంప్రదాయం ఏటా కొనసాగుతోంది.

ఊరూరా పంచాంగ శ్రవణం

తెలుగు నూతన సంవత్సర ఉగాది పండుగ రోజున కొత్త పంచాంగానికి పూజలు చేస్తారు. అనంతరం వేద పండితులు పంచాంగాన్ని చదివి వినిపిస్తారు. ఏడాది కాలంలో జరుగబోయే మంచి చెడులను గురించి పంచాంగ శ్రవణం ద్వారా తెలుసుకుంటారు. పల్లెలే కాదు పట్టణాల్లోనూ పంచాంగ శ్రవణ కార్యక్రమానికి ప్రజలు భారీ సంఖ్యలో హాజరవుతారు. ఆలయాల వద్ద పండితులు పంచాంగాన్ని చదివి వినిపిస్తారు. ముఖ్యంగా రైతులు కాలం ఎట్లా ఉంటుందన్న దానిపై ఆసక్తిగా వింటారు.

ఆరోగ్యానికి మేలు

ఉగాది పచ్చడి షడ్రుచుల సమ్మేళనంతో తయారు చేస్తారు. వేప పువ్వు, మామిడికాయ ముక్కలు, చింతపండు, కొత్త బెల్లం, ఉప్పు కలగలిపి తయారు చేసిందే ఉగాది పచ్చడి. ఆరు రుచుల మేళవింపుతో తయారు చేసిన పచ్చడి సేవించడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని చెబుతారు. అత్యుత్తమ ఔషధ గుణాలున్న వేప పువ్వును పచ్చడి తయారీలో వాడతారు. మానవ జీవితంలో ప్రేమ, సంపద, సంతానవృద్ధి మూడు ముఖ్యమైనవి. ఈ మూడింటిని అందించే చెట్టు మామిడి అంటారు. మామిడాకుల తోరణాలు ఇంటికి అందాన్నిస్తాయి. ఆరోగ్యాన్ని పంచుతాయి. మామిడి కాయ ముక్కలను పచ్చడిలో వేస్తారు. చింతపండు జీర్ణక్రియను మెరుగు పరుస్తుందని, బెల్లం వేడిని తగ్గించి శరీరాన్ని చల్లబరుస్తుందని చెబుతారు.

ఎడ్ల బండ్ల ప్రదర్శనలు


ఉగాది పండుగ రోజున ఎడ్ల బండ్ల ప్రదర్శనలు ఆకర్షణగా నిలుస్తాయి. రైతులు ఎడ్ల బండ్లకు రంగులు రుద్దడం, కొత్త చీరెలు కట్టి అందంగా ముస్తాబు చేస్తారు. అలాగే ఎడ్లను కూడా అలంకరిస్తారు. ఎడ్ల బండ్ల ప్రదర్శన కోసం పోటాపోటీగా ముస్తాబు చేసి ఆలయాల చుట్టూ తింపుతారు. ఎడ్ల బండ్ల ప్రదర్శనలను చూడడానికి ప్రజనలు ఎంతో ఆసక్తిని చూపుతారు. జిల్లా కేంద్రమైన కామారెడ్డి పట్టణంలోని అంగడిబజార్‌లో గ్రామదేవతల ఆలయాల చుట్టూ ఎడ్ల బండ్ల ప్రదర్శనలు నిర్వహిస్తారు. వేలమంది ప్రజలు ఈ వేడుకలకు హాజరవుతారు. జిల్లాలోని వివిధ మండలాల్లో ఉన్న ఆలయాల వద్ద కూడా ఎడ్లబండ్ల ప్రదర్శనలు కొనసాగుతాయి.

నవ్యతకు ఆరంభం ఉగాది



కామారెడ్డి అర్బన్: ఉగాది అనగానే నవ వసంతం రావడం చెట్లు చిగురించడం, పూత పూయడం, ప్రకృతిలో నూతనత్వానికి సూచనగా కనబడుతుంది. ఉగాది పండుగ సంవత్సరానికి తొలి రోజుగా సంబరంగా జరుపుకోవడం సంప్రదాయంగా వస్తుంది. ఉగాది సంవత్సరం ఆరంభ దినం, కాలంలో జరిగే పరిణామాలను పంచాంగ ఫలితాల రూపంలో ప్రజలు తెలుసుకుంటూ పంచాంగ పూజ చేస్తారు. ఆరు రుచులను కలబోసిన ఉగాది పచ్చడి, బెల్లం పోలెలు అమృతంగా భావించి ఆరగిస్తారు. శోభకృత్ అంటే ఏడాది అంతా సిరిసంపదలు, ఆయురారోగ్యాలు శోభిల్లాలని కోరడమే.

– డాక్టర్ అయాచితం నటేశ్వర శర్మ



కిరాయికి ఎడ్లబండ్లు..!

- కాడెద్దుల బండ్లకి పెరిగిన డిమాండ్
- ఉగాది నాడు ఆలయాల చుట్టూ ఊరేగింపునకు వినియోగం
- ఎడ్లబండ్లకు రూ. 5వేల నుంచి రూ. 10వేల వరకు చెల్లింపు



ఎడ్లబండ్ల ప్రదర్శన కోసం సంగారెడ్డి జిల్లా నుంచి కామారెడ్డి జిల్లా వాడి గ్రామానికి తీసుకువచ్చిన ఎద్దు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఒకప్పుడు వ్యవసాయంలో కీలక భూమిక పోషించిన కాడెడ్లు ప్రస్తుతం కనుమరుగయ్యాయి. ఆధునిక పద్ధతులు అందుబాటులోకి రావడంతో రైతులు ఎడ్లబండ్లను వీడి ట్రాక్టర్ల బాట పట్టారు. ఫలితంగా ఎడ్లబండ్ల ప్రాధాన్యత తగ్గిపోయింది. గ్రామాల్లో ఒకరిద్దరి వద్ద మాత్రమే ఎడ్ల బండ్లు ఉన్నాయి. అయితే గ్రామాలలో జరిగే జాతరలు, ఇతర పండుగల సమయంలో గ్రామదేవతల ఆలయాల చుట్టూ ఎడ్లబండ్ల ప్రదర్శన చేపడతారు. ముఖ్యంగా ఉగాదిరోజు జిల్లాలోని చాలాప్రాంతాలలో ఆలయాల వద్ద ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహిస్తారు. కొన్నిప్రాంతాలలో ఎడ్లబండ్ల ప్రదర్శనకు సంబంధించి మొక్కుబండ్ల (హొక్కుబాపతి)కు చాలా ప్రాధాన్యత ఉంటుంది. ఎడ్లబండ్ల ప్రదర్శనకు ఎడ్లబండ్లు అందుబాటులో లేకపోవడంతో చాలాగ్రామాలలో భక్తులు ఎడ్లను, బండ్లను ఇతర ప్రాంతాల నుంచి అద్దెకు తీసుకువస్తున్నారు. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండల కేంద్రం గోపాల్‌పేటలో ఉగాది సందర్భంగా జరిగే జాతర ఉత్సవాలలో శ్రీ నల్లపోచమ్మ ఆలయం చుట్టూ ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహిస్తారు.

నాగిరెడ్డిపేట మండలంలోని చీనూర్, వాడి, నాగిరెడ్డిపేట, గోపాల్‌పేట, బంజర, లింగంపల్లి, గోలిలింగాల, మాల్తుమ్మెద, వదల్‌పర్తి తదితర గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారి ఆలయం చుట్టూ ఎడ్లబండ్లను తిప్పుతారు. దీంతో మండలంలో చాలామంది భక్తులు ఎడ్లబండ్లను ఇత ప్రాంతాల నుంచి కిరాయికి తెచ్చుకున్నారు. ఎడ్లు, బండ్లు కలిపి రూ.5వేల నుండి రూ.10వేల వరకు అద్దె చెల్లించి తీసుకువస్తున్నారు. కొన్నిప్రాంతాలలో కేవలం ఎడ్ల జతకే రూ.5వేల నుండి రూ. 8వేల వరకు చెల్లిస్తున్నారు.

రాష్ట్రంలో కేసీఆర్ రాజ్యాంగం అమలు

- టీఎస్‌పీఎస్సీ లీకేజీలను సిట్టింగ్ జడ్జితో విచారణ చేయాలి
- లిక్కర్ స్కాంలో చట్టం తన పని తాను చేసుకుంటుంది
- కవితకు మద్దతుగా ఢిల్లీకి ప్రభుత్వ ఏజీ, కేబినెట్ మంత్రులు వెళ్తారా
- రైతులు, నిరుద్యోగుల కష్టాల కంటే కవిత స్కాంకే ప్రాధాన్యం
- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి

కామారెడ్డి టౌన్: రాష్ట్రంలో కేవలం సీఎం కేసీఆర్ రాజ్యాంగం మాత్రమే నడుస్తుందని, ప్రజలు, నిరుద్యోగులు, రైతులు కష్టాలు పడుతుంటే ప్రభుత్వానికి పట్టింపు లేదని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని రాజారెడ్డి గార్డెన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీ ఘటనలో సిట్టింగ్ జడ్జితో విచారణ చేయాలన్నారు. సిట్ పేరు తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. మంత్రి కేటీఆర్‌ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. పరీక్షలు రద్దయినందున అభ్యర్థులకు రూ. లక్ష నష్టపరిహారం చెల్లించాలన్నారు. నిధులు, నియామకాలు, నీళ్ల విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. సీబీఐ, ఈడీ దాడులు ఇప్పుడు కొత్తేం కాదని, గతంలో దేశంలో అనేక మందిపై దాడులు జరిగాయన్నారు. ఒక నరేంద్ర మోదీ వచ్చాకే ఈడీ దాడులు జరుగుతున్నాయనడం ప్రజల్ని పక్కదోవ పట్టించడమేనన్నారు. అవినీతి రహిత పాలన కోసం ఎంత పెద్దవాళ్లయిన వదిలేది లేదన్నారు. ఎమ్మెల్సీ కవిత లిక్కర్ స్కాంలో లేకుంటే విడుదల అవుతుందని.. దానికి బీఆర్‌ఎస్ ఇంత రాద్ధాంతం చేయడంపై మండి పడ్డారు. ఒకవైపు నిరుద్యోగులు, రైతులు, ప్రజాసమస్యలు ఉంటే సీఎం కుటుంబం, కేబినెట్ మంత్రులు, ప్రభుత్వ అడ్వొకేట్ జనరల్ ఢిల్లీకి పోవడం ఏమిటని ప్రశ్నించారు. ఏ తప్పు చేయకపోతే కవిత మొదట విచారణకు రాకుండా సుప్రీంకోర్టు మెట్లు ఎందుకు ఎక్కిందని ప్రశ్నించారు. కవిత వ్యక్తిగత విషయాన్ని తెలంగాణ సెంటిమెంట్‌కు ముడి పెట్టడం సిగ్గుచేటన్నారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన రాష్ట్రంలో అమలు చేస్తే అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం వచ్చేదని తెలిపారు. అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24న అన్ని కలెక్టరేట్‌ల వద్ద నిరసనలు, వినతి పత్రాలు ఇస్తామని, 25న రాష్ట్ర స్థాయిలో వ్యవసాయ శాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు మురళీధర్‌గౌడ్, నీలం చిన్నరాజులు, అసెంబ్లీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకట రమణారెడ్డి, బాణాల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

తప్పని నిరీక్షణ

- శనగ కొనుగోలు కేంద్రాల్లోనే బస్తాలు
- గన్నీ బస్తాలు, లారీల కొరత
- ఆందోళన చెందుతున్న రైతులు



ఖండెబల్లూర్‌లో రోడ్డుపైనే తూకాలు వేసిన శనగ బస్తాలు



బస్తాలపై నిద్రపోతున్న రైతులు

నిజాంసాగర్(జుక్కల్): ప్రభుత్వ మద్దతు ధర కోసం ఏర్పాటు చేసిన శనగ కొనుగోలు కేంద్రాల వద్ద తూకాలకు రైతులు రోజుల తరబడి నిరీక్షిస్తున్నారు. గన్నీ బ్యాగులు లేకపోవడం, తూకాలు చేసిన శనగ బస్తాల తరలింపునకు కావాల్సిన లారీల కొరతతో రైతులు అవస్థలు పడుతున్నారు. జుక్కల్ సొసైటీ ఆధ్వర్యంలో 30 పంచాయతీలుండగా జుక్కల్, ఖండెబల్లూర్ గ్రామాల్లో శనగ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు ఆయా కొనుగోలు కేంద్రాల్లో 38,690 బస్తాల శనగలు కొనుగోలు చేశారు. ఇంకా ఆయా కేంద్రాల్లో 25వేల బస్తాల శనగ తూకాలు చేయాల్సి ఉంది. కానీ శనగ తూకాలకు గన్నీ బస్తాలు లేక తూకాలు ముందుకు సాగడం లేదు. అయితే ఆయా కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి కొనుగోలు చేసిన శనగ బస్తాల తరలింపునకు లారీల కొరత ఉంది. 31,097 శనగ బస్తాలను గోదాములకు తరలించారు. ఇంకా 7,599 శనగ బస్తాలు కొనుగోలు కేంద్రాల వద్ద నిల్వ ఉన్నాయి. వారం రోజుల నుంచి శనగ బస్తాలు కొనుగోలు కేంద్రం వద్దే ఉండడం, అకాల వర్షాలకు శనగ బస్తాలను కాపాడుకునేందుకు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తూకాల కోసం కౌలాస్, చిన్నఎడ్గి, నాగుల్‌గావ్, కల్లాలి, పడంపల్లి, బస్వాపూర్, లాడేగాం, సావర్‌గావ్ రైతులు నిరీక్షిస్తున్నారు.

పున్నం నాడు తీసుకొచ్చిన



ఖండెబల్లూర్ కొనుగోలు కేంద్రానికి పున్నమి నాడు శనగలు తీసుకొచ్చిన. అమావాస్య నాటికి కాంట అయినా శనగ బస్తాలు పోలేదు. శనగ కాంట కోసం 15 రోజులైతే బస్తాల తరలింపు కోసం ఎన్నిరోజులు కాపలా ఉండాలో తెలుస్తలేదు. 15 రోజుల నుంచి కేంద్రం వద్దే ఉంటున్నా. – కుర్మ మారుతిగౌండ రైతు, పడంపల్లి

కాంట పెట్టి ఐదు రోజులవుతుంది



శనగ కాంట పెట్టి ఐదు రోజులవుతున్నా శనగ బస్తాలకు లారీలు రాకపోవడంతో ఇక్కడే పడిగాపులు కాస్తున్నా. మద్దతు ధర కోసం సొసైటీకి వస్తే రోజుల తరబడి నుంచి కాపు కాయాల్సి వస్తోంది. గన్నీబస్తాలు, లారీల కొరతతో ఇబ్బందులు పడుతున్నాం.

– కుర్మ సాయిగౌండ, రైతు, పడంపల్లి

గన్నీ బస్తాలు, లారీలు అవసరం



రైతులకు మద్దతు ధరకోసం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఇప్పటి వరకు 38,690 బస్తాలు కొనుగోళ్లు చేశాం. మరో 25వేల గన్నీ బస్తాలు సరఫరా చేస్తే ఆయా కేంద్రాల్లో శగన తుకాలు పూర్తవుతాయి. గన్నీ బస్తాలు, లారీల కోసం అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. –బాబురావ్, సొసైటీ, సీఈవో, జుక్కల్

డబుల్ ఇళ్ల కోసం జోరుగా పైరవీలు!

- ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్న దరఖాస్తు దారులు
- ఇల్లు వస్తుందని విందు ఏర్పాటు చేసిన ఓ దరఖాస్తుదారుడు!



భిక్కనూరులో పంపిణీకి సిద్ధంగా ఉన్న ఇళ్లు

భిక్కనూరు: మండల కేంద్రంతో పాటు రామేశ్వర్‌పల్లి, కాచాపూర్, పెద్దమల్లారెడ్డి గ్రామాల్లో డబుల్‌బెడ్ రూంలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. దీంతో ఈ నాలుగు గ్రామాల్లోని నిరుపేదలు ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఎలాగైనా డబుల్‌బెడ్ రూంలను దక్కించుకోవాలని కొందరూ తమవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యంగా మండల కేంద్రంలోని ఇళ్ల మంజూరు కోసం జోరుగా పైరవీలు కొనసాగుతున్నాయి. మండల కేంద్రంలో 50 డబుల్‌బెడ్ రూంలను ప్రభుత్వం నిర్మించింది. వీటి కోసం దరఖాస్తులను ఇటీవల ఆహ్వానించారు. 286 మంది ఇళ్లు లేని నిరుపేదలు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో కొందరు తమకు ఎలాగైనా డబుల్‌బెడ్ రూంలు వచ్చేలా చూడాలని ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నారు. కొందరు మాజీ ప్రజాప్రతినిధులు ఎలాగైనా మీకు ఇళ్లు ఇప్పిస్తామని భరోసా ఇస్తున్నారన్న విషయం చర్చనీయాంశమైంది. గ్రామసభ ద్వారా లాటరీ పద్ధతిలో కేటాయిస్తారన్న విషయం ఇంకా తేలకముందే డబుల్‌బెడ్ రూంలు పక్కాగా ఇప్పిస్తామని చెప్పడంతో సదరు దరఖాస్తుదారులు తమకు డబుల్‌బెడ్‌రూం వస్తుందని సంబర పడుతున్నారు. మంగళవారం ఒక దరఖాస్తుదారుడు తనకు ఇల్లు వస్తుందని మాజీ ప్రజాప్రతినిధి హామీ ఇచ్చాడని చెబుతూ మండల కేంద్రంలో మంగళవారం విందు భోజనాలను ఏర్పాటు చేయడం గమనార్హం. దీంతో డబుల్‌బెడ్ రూంల కేటాయింపులో అక్రమాలు జరిగే అవకాశం ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సందట్లో సడేమియాలాగా మరికొందరు దరఖాస్తుదారుల నుంచి రూ. రెండు వేల నుంచి రూ. ఐదు వేల వరకు వసూలు చేసినట్లు సమాచారం.

జాబితాను రూపొందిస్తున్నాం



భిక్కనూరుతో పాటు రామేశ్వర్‌పల్లి, కాచాపూర్, పెద్దమల్లారెడ్డి గ్రామాల్లో నిర్మించిన డబుల్ బెడ్‌రూంల కోసం దరఖాస్తులను ఆహ్వానించాం. ఈ మూడు గ్రామాల్లో 568 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎలాంటి పైరవీలకు తావు లేకుండా నిరుపేదలకు ఇళ్లను కేటాయించడం జరుగుతుంది. దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను సేకరించి అర్హుల జాబితాను రూపొందించడం జరుగుతుంది.

– ప్రేంకుమార్, తహసీల్దార్, భిక్కనూరు

బార్ అసోసియేషన్ కార్యవర్గం

కామారెడ్డి టౌన్: కామారెడ్డి జిల్లా న్యాయవాదుల బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా ఎన్. శ్రీధర్ వ్యవహరించారు. నూతన అధ్యక్షుడిగా అతిమాముల శ్రీధర్, ఉపాధ్యక్షుడిగా శ్రీకాంత్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా బండారి సురేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శిగా గంగారాం, గ్రంథాలయ కార్యదర్శిగా అన్సర్ అలీ, క్రీడల కార్యదర్శిగా శ్రవణ్ గౌడ్, కార్యవర్గ సభ్యులుగా ముఖీమ్, అంగ్రెజ్, విఠల్‌రావు, సందీప్ రెడ్డి, మహిళా ప్రతినిధిగా షబానా ఎన్నికయ్యారు.



అతిమాముల శ్రీధర్



బండారి సురేందర్

గ్రూప్-4 ఉచిత కోచింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్-4 పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఏప్రిల్ 4వ తేది నుంచి నిజామాబాద్‌లోని సుభాష్ నగర్‌లో గల ఓల్డ్ బీఎస్ఎన్ఎల్ భవనం రెండో అంతస్తులో ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ సీహెచ్ వెంకన్న మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదోతరగతి, ఇంటర్, డిగ్రీలో ఫస్ట్ క్లాస్‌లో పాసైన వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల వారు ఈనెలాఖరు వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థుల మెరిట్, రిజర్వేషన్ల ఆధారంగా అభ్యర్థులకు సీట్లు లభిస్తాయని డైరెక్టర్ పేర్కొన్నారు. వివరాలకు 08462-241055 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఇంజనీరింగ్ విద్యార్థిపై దాడి

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్ పరిధిలోని క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం విద్యార్థి విశాల్‌పై ఒక వర్గానికి చెందిన సుమారు 30మంది దాడికి పాల్పడ్డారు. బిటెక్ రెండో సంవత్సరం చదువుతున్న విశాల్‌పై నిందితులు కక్ష పెట్టుకొని కళాశాల నుంచి బయటకు రాగానే ముకుమ్మడిగా దాడి చేసి, గాయపర్చారు. దీంతో బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి, దాడికి పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

మానవ మనుగడకు వృక్షాలే ఆధారం

- డిజిటల్ పత్రాలను వినియోగించాలి
- జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా రిటైర్డు డైరెక్టర్ రామ్మూర్తి సోమ



సౌత్‌క్యాంపస్‌లో మాట్లాడుతున్న జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా రిటైర్డు డైరెక్టర్ రామ్మూర్తి సోమ

భిక్కనూరు: మానవ మనుగడకు చెట్లు ఆధారమని జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా రిటైర్డు డైరెక్టర్ రామ్మూర్తి సోమ అన్నారు. తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్‌లో జియో ఇన్‌ఫర్‌మెటిక్స్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం 'ప్రపంచ నీటి దినోత్సవం- అడవులు, ఆరోగ్యం'పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మానవులకు కావల్సిన ఔషదాలను, వనమూలికలను ఇతర అవసరాలకు ఉపయోగ పడే వాటిని చెట్లు అందిస్తాయన్నారు. ప్రస్తుతం వాడుతున్న కాగితానికి బదులుగా డిజటల్ కాగితాలను వాడాలని సూచించారు. రీసైకిల్ చేసిన ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇవ్వటం వల్ల పర్యావరణ అనుకూల విధానాన్ని అవలంబించుకోవచ్చన్నారు. జీఐఎస్ టెక్నాలజిని ఉపయోగించి జియోట్యాగింగ్ ఏవిధంగా చేయాలో వివరించారు. నీటి వనరులు సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. అనంతరం సౌత్‌క్యాంపస్ ఆవరణలో మొక్కలను నాటారు. ప్రిన్సిపాల్ కవితా తోరన్, హెచ్‌వోడి సుధాకర్‌గౌడ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలకు కలెక్టర్, మంత్రి ఉగాది శుభాకాంక్షలు




మంత్రి ప్రశాంత్‌రెడ్డి.. కలెక్టర్ హనుమంతు

సుభాష్‌నగర్: రాష్ట్ర రోడ్లు భవనాలు, గృహ నిర్మాణ, శాసనసభా వ్యవహారాల శాఖా మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రజలకు మంగళవారం ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. శోభకృత్ నామ సంవత్సరంలో జిల్లా ప్రజలందరికి శుభాలు చేకూరాలని ఆకాంక్షించారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రం బంగారు తెలంగాణగా రూపుదిద్దుకుంటోందన్నారు. అలాగే ప్రజలకు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఉగాది పర్వదిన శుభాకాంక్షలు ఒక ప్రకటనలో తెలిపారు.

సీపీ శుభాకాంక్షలు..



సీపీ నాగరాజు

ఖలీల్‌వాడి: జిల్లా ప్రజలకు తెలుగు నూతన సంవత్సరం శ్రీ శోభకృత్ నామ ఉగాది శుభాకాంక్షలను సీపీ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే శాంతి భద్రతలు ముఖ్యమన్నారు. ప్రజలందరూ శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా పోలీసులకు సహకరించాలని కోరారు.

జెడ్పీచైర్మన్ విఠల్‌రావు..

నిజామాబాద్‌నాగారం: జిల్లా ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు ఒక ప్రకటనలో శోభకృత్ నామ ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ప్రజలందరికి శుభాలు చేకూరాలని ఆకాంక్షించారు. పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని సూచించారు.

కిక్ బాక్సింగ్‌లో తెయూ విద్యార్థికి సిల్వర్ మెడల్

తెయూ(డిచ్‌పల్లి): ఉత్తరప్రదేశ్‌లోని వీర్ బహదూర్ సింగ్ పూర్వాంచల్ యూనివర్సిటీ (జాన్‌పూర్)లో ఈ నెల 20నుంచి ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ కిక్ బాక్సింగ్ ఉమెన్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఈ టోర్నీలో తెలంగాణ యూనివర్సిటీ విద్యార్థిని ఉమ సిల్వర్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా వర్సిటీ క్రీడావిభాగం డైరక్టర్ సంపత్ మంగళవారం మాట్లాడుతూ.. జాతీయ స్థాయి టోర్నమెంట్‌లో తెలంగాణ యూనివర్సిటీకి ఇది తొలి పతకం అన్నారు. క్రీడాకారిణి ఉమ, కోచ్ శ్రీనివాస్‌కు వీసీ రవీందర్, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ విద్యావర్ధిని, స్పోర్ట్స్ డైరక్టర్ సంపత్ అభినందనలు తెలిపారు.

రాజ్‌భవన్ ఉగాది ఉత్సవాల్లో తెయూ వీసీ



తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో నిర్వహించిన శోభాకృత్ నామ సంవత్సర ఉగాది ఉత్సవాల్లో తెలంగాణ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ రవీందర్‌తో పాటు పలువురు ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు. గవర్నర్ ఆహ్వానం మేరకు వివిధ రంగాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పదిమంది విద్యార్థులు దిలీప్ కుమార్, కరుణాకర్, జీవన్, గంగాధర్, అనిల్, నికేష్, మృణాలిని(యూనివర్సిటీ కళాశాల), అఖిల (ఉమెన్స్ కళాశాల), మౌనిక (ఆర్‌కే కళాశాల), అక్షిత (జీజీ కళాశాల)లు ఉత్సవాలకు హాజరయ్యారు. ఈసందర్భంగా వివిధ రంగాలకు చెందిన 13 మందిని గవర్నర్ సన్మానించారు. అనంతరం నిర్వహించిన పంచాంగ శ్రవణంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వేడుకల్లో యూనివర్సిటీ విద్యార్థులు పాల్గొనడం ఆనందంగా ఉందని వీసీ అన్నారు. గవర్నర్ తమిళిసై సౌందర రాజన్‌కు ధన్యవాదాలు తెలిపారు. యూనివర్సిటీ ప్రతినిధిగా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఈడీ పరీక్ష ఫీజు 27లోపు చెల్లించాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్ష ఫీజు చెల్లింపు గడువు మంగళవారంతో ముగిసింది. రూ.100ల అపరాధ రుసుముతో ఈ నెల 27వరకు పరీక్ష ఫీజును చెల్లించే అవకాశం ఉందని కంట్రోలర్ ప్రొఫెసర్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తమ సంబంధిత కళాశాలల్లో ఫీజు చెల్లించాలని ఆమె సూచించారు. వివరాలకు వెబ్‌సైట్ www.telanganauniversity.ac.inను సంప్రదించాలని ఆమె కోరారు.

క్రైం కార్నర్

బియ్యం లారీ పట్టివేత

రుద్రూర్: కోటగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోతంగల్ సమీపంలో మంజీరా నది వద్ద మంగళవారం తెల్లవారుజామున పోలీసులు బియ్యం లారీని పట్టుకున్నారు. మహారాష్ట్ర నుంచి బీర్కూర్ వెళుతున్న లారీలో ఉన్న బియ్యంకు సంబంధించిన ధ్రువపత్రాలను చూపనందున పోలీసులు లారీని కోటగిరి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం సివిల్ సప్లై అధికారులకు సమాచారం అందించగా.. సివిల్ సప్లై డీటీ అశ్వక్ అహ్మద్ బియ్యం శాంపిల్ సేకరించారు. ల్యాబ్‌కు పంపిస్తామని పీడీఎస్ బియ్యంగా నిర్ధారణ అయితే జిల్లా అధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఒకరిపై చీటింగ్ కేసు నమోదు

ఖలీల్‌వాడి: బైక్ నెంబర్ ప్లేట్‌లో నెంబర్ మార్చినందుకు ఓ వ్యక్తిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ట్రాఫిక్ సీఐ చందర్‌రాథోడ్ మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా.. నగరంలోని సాయిరెడ్డి పెట్రోల్ బంక్ వద్ద ట్రాఫిక్ ఎస్సై రాజేశ్వర్‌గౌడ్ వాహనాల తనిఖీలు చేస్తుండగా.. ఆటోనగర్‌కు చెందిన షేక్ ఇలియాస్ తన రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనం పత్రాలను చూయించాడు. వాహనాదారుడు చూపించిన ఆర్‌సీలో టీఎస్ 07 ఈడబ్ల్యూ 2420 ఉండగా, బండిపై ఉన్న నెంబర్ ప్లేట్‌పై టీఎస్ 07ఎఫ్‌డబ్ల్యూ 2420 ఉంది. దీంతో సదరు వాహనదారుడైన షేక్ ఇలియాస్‌పై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చికిత్సపొందుతూ గుర్తుతెలియని ఇద్దరి మృతి



ఖలీల్‌వాడి: నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో గుర్తుతెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై సాయినాథ్ మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా.. ఈ నెల 18న ఖిల్లా రోడ్డు వద్ద గుర్తు తెలియని వ్యక్తి (60) అనారోగ్యంతో పడిపోయి ఉండటంతో అతడిని స్థానికులు అంబులెన్స్‌లో గవర్నమెంట్ హాస్పిటల్‌కి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి వివరాలు ఎవరికైనా తెలిసినచో ఐదో టౌన్ పోలీస్ స్టేషన్‌ని, లేదా 87126 59727, 87126 59844 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

బడాబజార్ వద్ద..



ఖలీల్‌వాడీ: నగరంలో జీజీహెచ్‌లో మంగళవారం ఓ గుర్తుతెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై పూర్ణేశ్వర్ తెలిపిన వివరాలు ఇలా.. నగరంలోని బడాబజార్ కెనరా బ్యాంక్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి(60) అనారోగ్యంతో పడిపోయి ఉండగా స్థానికులు అతడిని అంబులెన్స్‌లో జీజీహెచ్‌కు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడు భిక్షాటన చేస్తూ జీవించేవాడని, అనారోగ్యం మృతి చెందారని మున్సిపల్ జవాన్ బుగ్గల రాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు పోలీసులు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో గానీ, 8712659838, 8712659715 నెంబర్లను సంప్రదించాలన్నారు.

మెసేజ్ ఓపెన్ చేయగానే రూ.1.39 లక్షలు మాయం



లింగంపేట(ఎల్లారెడ్డి): ఓ వ్యక్తి తన మెబైల్‌లోని టెలిగ్రాంకు వచ్చిన మెసేజ్ ఓపెన్ చేసి చూడటంతో సుమారు రూ.1.39లక్షలను సైబర్ మోసగాళ్లు కాజేశారు. మండలకేంద్రంలో జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన పార్శి ప్రభాకర్ ఫోన్ నంబర్ టెలిగ్రాం యాప్‌కు ఈనెల 19వ తేదీన +85297834014 నుంచి మెస్సేజ్ వచ్చింది. నూతన నంబర్ నుంచి మెస్సేజ్ రావడంతో బాధితుడు ఓపెన్ చేశాడు. దీంతో ఆదివారం నుంచి సోమవారం వరకు బాధితుడు బ్యాంక్ ఖాతా నుంచి విడతల వారీగా రూ. 1.39 లక్షల డబ్బును సైబర్ నేరగాళ్లు తమ ఖాతాలోకి మళ్లించుకున్నారు. సైబర్ నేరగాళ్లపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

నిందితుల రిమాండ్

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని మహమ్మద్‌నగర్ గ్రామంలో ఇటీవల కారు అద్దాలను ధ్వంసం చేసిన కేసులో ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రాజు మంగళవారం తెలిపారు. ఈనెల 14న గ్రామంలోని మాజీ జెడ్పీచైర్మన్ దఫేదార్ రాజు వాహనాం అద్దాల ను మల్లయ్యగారి ఆకాష్, ద్యావడ రాజశేఖర్ ధ్వంసం చేశారు. విచారణ చేపట్టి నిందితులను కోర్టుకు రిమాండ్ చేశామని ఎస్సై తెలిపారు.

చెరువులో పడి వీఆర్‌ఏ మృతి!



రుద్రూర్: మోస్రా మండల కేంద్రంలోని మసాని చెరువులో ప్రమాదవశాత్తు పడి గ్రామానికి చెందిన వీఆర్‌ఏ మృతిచెందాడు. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన వీఆర్‌ఏ నూలు పర్వయ్య(45) మంగళవారం ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. కాలకృత్యాలకు వెళ్లి జారిపడి ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు. పర్వ య్య మోస్రా తహసీల్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ కలహాల వల్ల భార్య దూరంగా ఉంటున్నట్లు సమాచారం. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు.

నిజామాబాద్‌లో ఆపరేషన్ ఛబుత్ర



తనిఖీల్లో పట్టుబడ్డ వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు

- 60 బైక్‌లు స్వాధీనం
- 150 మందికి కౌన్సెలింగ్ ఇచ్చిన ఏసీపీ కిరణ్‌కుమార్

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పరిధిలో సోమవారం రాత్రి 10 గంటల నుంచి మంగళవారం ఉదయం 3గంటల వరకు పోలీసులు 'ఆపరేషన్ ఛబుత్ర' నిర్వహించారు. ఈసందర్భంగా ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు, సౌత్ సీఐ జగడం నరేష్, నగర టౌన్ సీఐ వెంకట నారయణ ఆధ్వర్యంలో బస్టాండ్, రైల్వేస్టేషన్, రాష్ట్రపతి రోడ్, గాంధీచౌక్, ప్రభు త్వ ఆస్పత్రి పరిసరా ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. వాహనాల తనిఖీలు నిర్వహించి, సరైనా పత్రాలు లేని వాహనాలను ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రాత్రివేళలో హోటళ్లు, పాన్‌షాపులు, దుకాణాలను తెరిచి ఉంచిన వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. సుమారు 60 బైక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకోగా, 150 మందికి ఏసీపీ కిరణ్‌కుమార్ కౌన్సెలింగ్ ఇచ్చారు. నగరంలో శాంతిభద్రతల కోసం ఆపరేషన్ ఛబుత్ర చేపట్టినట్లు ఏసీపీ తెలిపారు. స్వాధీనం చేసుకున్న బైక్‌లకు సరైన పత్రాలను చూపిన వాహనాదారులకు అందజేశారు. గతంలో సీపీ కార్తికేయ ఉన్నప్పుడు నగరంలో ఆపరేషన్ ఛబుత్రలు నిర్వహించారు. ఏడాది తర్వాత మళ్లీ నిర్వహించడంతో గొడవలు తగ్గే అవకాశాలు ఉన్నట్లు నగర ప్రజలు అంటున్నారు.

జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య

ఖలీల్ వాడి: నగరంలోని నాందేవ్‌వాడలో ఓ వ్యక్తి మద్యానికి బానిసై, జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై శ్రావణ్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా.. నాందేవ్‌వాడకు చెందిన హాట్కరి కందేరావు(38), కిసాన్ గంజ్‌లో కూలీ పని చేస్తూ జీవిస్తుండేవాడు. కందేరావు మద్యానికి బానిసై, భార్యను తరుచు కొట్టడంతో, కొన్నేళ్ల క్రితం ఆమె తన ఇద్దరు ఆడ పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి తన తల్లి మంగళ్ బాయ్‌తో కలిసి నాందేవ్‌వాడలో నివసిస్తున్నాడు. ఈక్రమంలో మంగళవారం భార్య కాపురానికి రావడం లేదని, మద్యానికి బానిసై, జీవితంపై విరక్తి చెంది ఇంట్లోని దూలానికి చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కొనసాగుతున్న ఇంటర్ వార్షిక పరీక్షలు

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో ఇంటర్ వార్షిక పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఉన్న 54 పరీక్ష కేంద్రాల్లో 14230 మంది విద్యార్థులు జనరల్‌లో, 1830 మంది ఒకేషన్‌లో పరీక్షలు రాశారు. జనరల్‌లో 488 మంది. ఒకేషనల్‌లో 184 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

చోరీకి యత్నించిన నిందితులకు దేహశుద్ధి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని 1వ వార్డులోగల ఓ ఓ ఇంట్లోకి మంగళవారం మధ్యాహ్నం ఇద్దరు దుండగులు చొరబడి చోరీకి యత్నించగా.. స్థానికులు పట్టుకొని దేహశుద్ధి చేశారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామంలోని మ్యాదరి శంకర్ ఇటీవల ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. భార్య పద్మ పని నిమిత్తం బయటకు వెళ్లింది. ఇంట్లో కుమారుడు భూమేశ్ ఉండగా.. బైక్‌పై వచ్చిన ఒక మగ వ్యక్తి, ఆడ మనిషి ఇంట్లోకి చొరబడి భూమేశ్‌ను అరవకుండా పట్టుకుని లోపలికి వెళ్లారు. వారినుంచి భూమేశ్ తప్పించుకుని బయటకు వచ్చి అరవడంతో కాలనీవాసులు వచ్చి, ఇంటికి గొళ్లెం పెట్టి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. సదరు వ్యక్తులు బీరువాలో బంగారు నగలు తీసుకుని తప్పించుకోవడానికి సిద్ధంగా ఉండగా.. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గొళ్లెం తీశారు. వెంటనే స్థానికులు నిందితులకు దేహశుద్ధి చేశారు. పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ



జనగామలో ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

బీబీపేట: మండలంలోని జనగామ గ్రామంలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన బొమ్మెర బాల్‌నర్సవ్వ ఈనెల 17న కామారెడ్డిలోని బంధువుల వద్దకు వెళ్లి.. తిరిగి 20న ఇంటికి వచ్చింది. ఇంటి తాళాలు తీసిఉండటంతో లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని బంగారం, నగదును గుర్తుతెలియని దుండగులు చోరీ చేశారు. సుమారు పన్నెండు తులాల బంగారు అభరణాలు, ఇరవై తులాల వెండి పట్టగొలుసులు, రూ. 9వేల నగదును ఎత్తుకెళ్లారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్ టీం సభ్యులు వచ్చి వివరాలు సేకరించారు.



ఏటీఎంను పరిశీలిస్తున్న పోలీసులు

ఏటీఎం చోరీకి విఫలయత్నం

భిక్కనూరు: మండల కేంద్రంలోని ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రంలో గుర్తుతెలియని వ్యక్తి చోరీకి విఫలయత్నం చేశాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మండల కేంద్రంలోని పాత జాతీయరహదారి పక్కన ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలోకి దుండగుడు ప్రవేశించి, మిషిన్ తలుపును ధ్వంసం చేశాడు. అయినప్పటికీ డబ్బుల పెట్టె తెరుచుకోలేదు. దీంతో సైరన్ మోగడంతో భయపడి పారిపోయారు. సమాచారం అందుకున్న ఎస్సై ఆనంద్‌గౌడ్ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించాడు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

అరటిపండ్ల లారీ బోల్తా

భిక్కనూరు: మండలంలోని బస్వాపూర్ గ్రామం సమీపంలోగల జాతీయ రహదారిపై మంగళవారం అరటి పండ్ల లారీ బోల్తా పడింది. హైదరాబాద్ నుంచి కామారెడ్డి వైపు అరటి పండ్ల లోడ్‌తో వెళ్తున్న లారీ అకస్మాత్తుగా అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు లారీ డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

